నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

ఘనంగా గణిత దినోత్సవం

కాసిపేట : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య అధ్యక్షతన గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత మేళాను నిర్వహించగా విద్యార్థుల గణిత ప్రాజెక్టుల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు మ్యాథ్స్ డే ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. గణిత ప్రాజెక్టుల్లో ప్రతిభ చూపిన సీనియర్స్‌లో 8వ తరగతి విద్యార్థి గీతాంజలి మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థి హేమంత్ రెండో బహుమతి సాధించారు. జూనియర్స్‌లో 7వ తరగతి విద్యార్థి అభిరామ్ మొదటి బహుమతి, 6వ తరగతి విద్యార్థి అభిజ రెండో బహుమతి సాధించారు. వీరికి ప్రిన్సిపాల్ నాగమల్లయ్య బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కూకట్ల రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన రేచిని విద్యార్థులు

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఆదిలాబాద్ జట్టు తరఫున ఆడిన హరీష్, వెంకటేష్ బంగారు పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పాశం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతమైన రేచిని హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా సహకారాన్ని అందిస్తున్న పీఈటీ శ్రీనివాస్‌ను, విద్యార్థులను, ఉపాధ్యాయులను గ్రామపెద్దలు అభినందించారు. అభినందన కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పరిమళ పాల్గొన్నారు.



సుఫారీ ఇచ్చి యువకుడి హత్యాయత్నం

- హత్య చేసేందుకు రూ.15లక్షలకు ఒప్పందం
- నలుగురి అరెస్ట్, పరారీలో ఇద్దరు
- నగదు, వాహనం, మొబైల్ స్వాధీనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తన కూతురిని ప్రేమించాడన్న కారణంతో ఓ తండ్రి ఆ యువకున్ని హతమార్చేందుకు ప్లాన్ వేసిన ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. కిరాయి గూండాలతో రూ.15లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. హత్యను ప్రమాదంలా చూపే క్రమంలో కరెంట్ స్తంభానికి ఢీకొని పోలీసులకు చిక్కారు. ఈ ఘటనకు సంబంధించిన కేసు వివరాలను డీఎస్పీ ఉమెందర్ శనివారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని దుర్గానగర్ కౌన్సిలర్ ఉష్కం రఘుపతి తన కుతూరిని వంశీ అనే యువకుడు ప్రేమిస్తున్నాడని తెలుసుకున్నాడు. తన కుతూరి జోలికి రావద్దని రెండేండ్ల క్రితం వార్నింగ్ ఇచ్చాడు. అయినా మార్పు రాకపోవడంతో హత్య చేయాలని నిర్ణయించాడు. రఘుపతికి మిత్రుడైన చౌహాన్ రవికి సుఫారీ ఇచ్చాడు. రవి తన మిత్రులు అశోక్, దిల్షాద్‌తో కలిసి వంశీ కదలికలపై నిఘాపెట్టారు. యాక్సిడెంట్ చేసి హత్య చేయాలని ప్లాన్ వేశారు. దీనికి జైనథ్ మండలం మేడిగూడకు చెందిన రాజు వద్ద నుంచి రూ.10వేలు చెల్లించి పాత జీపు తీసుకొచ్చారు. ఈ నెల 17న ఎన్టీఆర్ చౌరస్తా నుండి అశోక్ జీపును తీసుకొని కేఆర్‌కే కాలనీకి వెళ్లాడు. ఆ తర్వాత రవి, అశోక్ కలిసి సాయంత్రం వంశీ ఇంటి వైపు వెళ్లొచ్చారు. వంశీ ఉదయం 5గంటల తర్వాత పాల కోసం మణిపూర్ కాలనీ మిల్క్ డెయిరీకి వెళ్లి అక్కడి నుండి ఆదిలాబాద్ టౌన్‌కు వెళ్తాడని తెలుసుకున్నారు. దీంతో మరుసటి రోజు 18న ఉదయం 5గంటల ప్రాంతంలో డెయిరీ నుంచి పాలను స్కూటీపై తీసుకొస్తుండగా వంశీని మావల శ్మశాన వాటిక దగ్గరలో ఢీ కొట్టారు. మరో సారి ఢీకొట్టేందు యత్నించగా జీపు కరెంట్ స్తంభానికి ఢీకొనగా అది విరిగి స్కూటీపై పడడంతో నుజ్జు నుజ్జు అయింది. ఢీ కొట్టిన జీపును వదిలి నిందితులు పారిపోయారు. ఈ ప్రమాదంలో వంశీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. జీపును వదిలి వేయడంతో మావల పోలీసులు విచారణ చేపట్టి నలుగురు నిందితులను పట్టుకున్నారు. ఉష్కం రఘుపతి, ఆయన భార్య ఉష్కం అరుంధతి ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు. అరెస్ట్ అయిన నలుగురి నుండి రూ.18వేల500 నగదు, 4 మొబైల్ ఫోన్‌లు, రెండు మోటార్ సైకిళ్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ సైదారావ్, జైనథ్ సీఐ నరేష్, సీసీఎస్ సీఐ, మావల ఎస్ఐ విష్ణువర్ధన్, రూరల్ ఐడి పార్టీ రమణయ్య, కరీం, సీసీఎస్‌లను ఎస్పీ అభినందించారు.

కార్మికుల హక్కుల రక్షణకు సీఐటీయూని గెలిపించుకోవాలి

- ఎస్సీఎంయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి కార్మికుల హక్కులపై నిరంతరం పోరాడే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)ను గెలిపించాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ కోరారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గోలేటి సీహెచ్‌పీలో ఏరియా ఇన్‌చార్జి అంబాల ఓదెలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘంగా గెలిచి వన్‌టైం అగ్రిమెంట్లు చేసిన ఏఐటీయూసీ లాంటి సంఘాలను ఓడించి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యాజమాన్యంపై నిరంతరం పోరాడే సీఐటీయూ(ఉదయించే సూర్యుడు గుర్తు)ను గెలిపించాలని కార్మికులను కోరారు. గతంలో ఏఐటీయూసీ చేసుకున్న వన్‌టైం అగ్రిమెంట్ల వల్ల మైనింగ్ సిబ్బందికి, హెడ్‌మెన్‌కు క్యాడర్ స్కీం, సర్ఫేస్‌లో ఉద్యోగాలు ఇచ్చే విషయంపై నష్టం చేసిన తీరును గమనించాలని కార్మికులను కోరారు. భూపాలపెల్లి, మందమర్రి ఏరియాలో గెలిచినా కూడా కనీసం స్వచ్ఛత్ సమావేశాలకు యాజమాన్యంపై ఒత్తిడి చేయకుండా గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో కలిసి క్వార్టర్లు, డిప్యూటేషన్, ట్రాన్స్‌ఫర్లపై పైరవీలతో కార్మికులను దోచుకుంటున్న సంఘాలను ఓడించి నిజాయితీగా పనిచేస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఇన్ని రోజులు ప్రభుత్వ అనుబంధ సంఘంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అందులో చేరుతున్న టీబీజీకేఎస్ నాయకులతో ఒరిగేదేమీలేదన్నారు. మళ్లీ ప్రభుత్వం అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే గతంలో టీబీజీకేఎస్ పద్ధతిలోనే దోచుకుంటారన్నారు. కార్మికులు నిజాయితీతో పనిచేస్తున్న సీఐటీయూ ఉదయించే సూర్యుడి గుర్తును 27న జరిగే ఎన్నికల్లో గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో అబోజి రమణయ్య, అల్లి రాజేందర్, చైతన్యరెడ్డి, సిద్ధెంకి సత్తయ్య పాల్గొన్నారు.

భగీరథ రావడం లేదు..రోడ్లు కావడం లేదు..!

- అధికారుల పనితీరుపై సభ్యుల ఆగ్రహం
- ఉన్నతాధికారుల గైర్హాజరుపైనా అసంతృప్తి
- సమన్వయంతో సాగుదామని నూతన ఎమ్మెల్యేల పిలుపు
- సాదాసీదాగా జడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం.. బీఆర్ఎస్ స్థానంలో.. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వంలో నిర్వహించిన తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. అధికారుల పనితీరుపై పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయడం మినహా.. సమావేశం అంతా ప్రశాంతంగా కొనసాగింది. ఏండ్లు గడుస్తున్నా ఏజెన్సీ ప్రాంతంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని..అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం ఉండటం లేదని సభ్యులు ప్రస్తావించారు. మరోపక్క జిల్లాలో కీలకమైన జడ్పీ సమావేశాలకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓతో పాటు పలువురు ఆయాశాఖల ఉన్నతాధికారులు హాజరుకాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పరిషత్ అధ్యక్షుడు జనార్దన్ రాథోడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా ముఖ్య అతిథిగా హాజరుకాగా.. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, వెడ్మ బొజ్జు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జడ్పీ సీఈఓ గణపతి పాల్గొన్నారు.



భగీరథ రావడం లేదు..!

సమావేశం ప్రారంభం కాగానే విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. మన ఊరు- మనబడి పనులు నత్తనడకన సాగుతున్నాయని వాటిని వేగవంతం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలుపురు సభ్యులు సూచించారు. మిషన్ భగీరథపై వాడీవేడీగా సమీక్ష జరిగింది. ఇంద్రవెల్లి మండలంలోని చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆ మండల జడ్పీటీసీ పుష్పలత పేర్కొన్నారు. ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే స్వగ్రామం పరిధిలోని చాప్రల్ గ్రామంలో నీటి సరఫరా జరగడం లేదని ఈ సమస్య మీద వెంటనే దృష్టిసారించాలని సూచించారు. నూతన ప్రభుత్వం ఏర్పడి పక్షం రోజులే గడిచిందని.. దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తుందని తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి తెలిపారు. రెండు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేస్తున్నామని..మిగితావి కూడా త్వరలోనే అమలవుతాయని వివరించారు. చాలా చోట్ల రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం ఆగిపోయిందని.. వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని పలురు సభ్యులు కోరగా.. అటవీ అనుమతులు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందని ఆర్‌అండ్‌బీ అధికారులు సమాధానమిచ్చారు. ఈ విషయంలో జోక్యం చేసుకున్న జడ్పీ చైర్మెన్ వెంటనే అటవీ, ఆర్‌అండ్‌బీ అధికారులతో ఒక కమిటీ వేసి ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మరోపక్క ఉపాధిహామీ నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహిస్తున్నారని వీటిలో రూ.కోట్ల నిధులు దుర్వినియోగమైనా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గుడిహత్నూర్ జడ్పీటీసీ బ్రహ్మానంద్ ప్రశ్నించారు. కేవలం తూతూమంత్రంగా సస్పెండ్ చేసి మళ్లీ విధుల్లోకి తీసుకుంటున్నారని మండిపడ్డారు. వీటితో పాటు విద్యా, వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, వ్యవసాయం, సంక్షేమశాఖల, మహిళా శిశుసంక్షేమం, డీసీఎంఎస్, కోఆపరేటీవ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు.


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సన్మానం


ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల శంకర్‌కు సన్మానం

నూతన ఎమ్మెల్యేల తొలి అడుగు..!

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారిపోవడం.. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసింది. మరోపక్క జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ముగ్గురు కొత్త వారు కావడం గమనార్హం. ఇది వరకు ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, అనిల్‌జాదవ్ ఇది వరకే జడ్పీటీసీలు ఎన్నికైన జడ్పీ సమావేశంలో పాల్గొన్న అనుభవం ఉన్నప్పటికీ.. ఎమ్మెల్యేలుగా మాత్రం తొలిసారి సభలో అడుగుపెట్టారు. ఖానాపూర్ నుంచి గెలుపొందిన వెడ్మబొజ్జు మాత్రం తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి జడ్పీ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వీరికి సభ్యులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుదామని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలి : జనార్దన్ రాథోడ్, జడ్పీ చైర్మెన్



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేర్చాలి. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టిసారించి పరిష్కరించాలి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగి జిల్లా అభివృద్ధికి పాటుపడాలి.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే



తొలిసారి ఈ సభలోకి స్థానిక సంస్థల ద్వారానే వచ్చాను. ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు చేసి ఈ సంస్థలకు ఉన్న అధికారాలను కోత విధించింది. ఇందులో ప్రభుత్వ పెత్తనం పెరిగింది. గతంలో జడ్పీ కేబినేట్ ర్యాంకుతో సమానంగా ఉండేది. నిధుల కొరత తీర్చడంపై దృష్టిసారించాలి. ఉపాధిహామీ నిధులు ప్రభుత్వానికి కాకుండా నేరుగా జడ్పీలకు కేటాయించాలి. వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధికి ముందుకు సాగుదాం.

అందరం కలిసి అభివృద్ధి చేద్దాం : అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



జిల్లా పరిషత్ నాకు దేవాలయం లాంటిది. జడ్పీటీసీ ఎన్నికైన అనుభవం ప్రస్తుతం ఉపయోగపడుతుంది. జిల్లాలో ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడం వంటి సమస్య అసెంబ్లీలో ప్రస్తావనకు రావడం దురదృష్టకరం. భగీరథ అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషిచేయాలి.

అన్ని రంగాలను అభివృద్ధి చేస్తాం : వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



తనను చట్టసభలకు పంపించిన ప్రజలకు ధన్యవాదాలు. తక్కువకాలంలోనే ప్రజా సమస్యలు పరిష్కరించే అవకాశం లభించింది. అధికారులు ప్రజలను వారి కార్యాలయాలకు తరుచూ తిప్పుకోవద్దు. జనం ఏదైనా సమస్యతో వస్తే అది పరిష్కారం అవుతుందా లేదా వెంటనే చెప్పాలి. గత ప్రభుత్వంలో ధర్నాలను కూడా నియంత్రించారు. ప్రస్తుతం ప్రజాప్రభుత్వం ఏర్పడింది. విద్యా, వైద్యం, సంక్షేమం తదితర రంగాలను మెరుగుపరుస్తాం. దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

బీఆర్ఎస్‌కు మరో షాక్..!

- గులాబీ పార్టీకి డీసీసీబీ చైర్మెన్ భోజారెడ్డి రాజీనామా
- అదే దారిలో మరికొందరు ముఖ్య నాయకులు
- ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి
- వరుస పరిణామాలతో పార్టీ క్యాడర్‌లో అయోమయం

అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన గులాబీ పార్టీని వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండే స్థానాలకు పరిమితం కావడంతో ఆ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికలో ఓటమి బాధను మరువక ముందే.. ఇన్నాండ్లు పార్టీతో పాటు కీలక పదవుల్లో ఉన్న నాయకులు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులతో పాటు కింది స్థాయి క్యాడర్ పార్టీకి దూరంకాగా.. తాజాగా పార్టీతో ఏండ్లుగా అనుబంధం కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)చైర్మెన్ అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. శనివారం ఆదిలాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ఆయన అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అదే దారిలో మరికొందరు ముఖ్య నాయకులు కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యమ కాలంతో పాటు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పదేండ్ల పాటు అధికారాన్ని చేపట్టిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) తిరుగులేని శక్తిగా ఉండేది. ఉమ్మడి జిల్లాను ఏకఛత్రాధిపత్యంతో ఏలింది. సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేల వరకు కొందరు మినహా అన్ని స్థాయిల్లోనూ ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉండేవారు. ఉమ్మడి జిల్లాలో బలమైన శక్తిగా ఉన్న బీఆర్ఎస్‌కు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం ఎదురైంది. రెండు సార్లు అధికారం చేపట్టిన ఆ పార్టీని ప్రజలు తాజా ఎన్నికల్లో తిరస్కరించారు. పది అసెంబ్లీ స్థానాలకు గాను ఎనిమిదింటిని కోల్పోయింది. ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో మాత్రమే విజయం సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం.. ఉమ్మడి జిల్లాలోనూ నాలుగు ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. దీంతో తూర్పు జిల్లాలో కాంగ్రెస్ ఏకంగా మూడు సీట్లు రావడం.. అక్కడ పార్టీ మరింత బలంగా మారడంతో గులాబీ పార్టీకి చెందిన అనేక మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారంలోకి వచ్చి పక్షం రోజుల్లోనే ఉమ్మడి జిల్లాలో ఐదు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే ఆయా మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లపై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు అందించడం చర్చనీయాంశమైంది. మరోపక్క సింగరేణిలోనూ టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు ఆ సంఘానికి రాజీనామా చేయడం.. కింది స్థాయి క్యాడర్ ఇతర సంఘాల్లో చేరిపోవడంతో ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీ బలహీన పడుతూ వస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి పార్టీని వీడేందుకు రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది.

అదే దారిలో మరికొందరు..!

రాజకీయాల్లో ఉన్న నాయకులు ఎవరు ..ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి ఉంది. ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో అధికార పార్టీలోకి నాయకుల వలసలు పెరుగుతున్నాయి. తాజాగా ఏడాది కిందట ఎన్నికైన డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి గులాబీ పార్టీని వీడటం ప్రాధాన్యం సంతరించుకుంది. పదవిలో కొనసాగేందుకు మరో నాలుగేండ్లు సమయం ఉండటంతో అధికార పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇదే కోవలో ఆదిలాబాద్ జిల్లాలో కీలక ప్రజాప్రతినిధిగా ఉన్న జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ సైతం గులాబీ పార్టీని వీడే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు ముఖ్య నాయకులు సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల్లో అధికార పార్టీ తరఫున పోటీ చేస్తేనే బాగుంటుందనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవాలని భావిస్తున్నారు. మరోపక్క త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా కీలక నాయకులు పార్టీని వీడి వెళ్లిపోవడం గులాబీ పార్టీ క్యాడర్‌లో కలవరం రేపుతోంది. ఎన్నికల వరకు ఇంకా ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయోనని ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎస్ఆర్‌కె పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



రామకృష్ణాపూర్ : పట్టణంలోని ఎస్ఆర్‌కె పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉప్పలయ్య పాల్గొని విద్యార్థులతో కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థి, విద్యార్థినులు వివిధ వేషధారణలో వేదికపై నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో అన్ని మతాల సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రతి పండుగలను ఘనంగా నిర్వహిస్తూ వాటి గురించి పిల్లలకు తెలియజేస్తామన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుంటామని పేర్కొన్నారు. అలాగే స్థానిక అల్ఫాన్సా కాన్వెంట్ పాఠశాలలో ముందస్తు మేరీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణ నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అయ్యప్ప పడిపూజ వేడుక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. సాయినగర్‌కు చెందిన వెంకట్‌గౌడ్ గురు స్వామి తన 15వ శబరి యాత్ర సందర్భంగా తన నివాసంలో పండితులు గురుస్వాములు బ్రహ్మశ్రీ ముసునూరి సూర్య భాస్కరశర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రకరకాల పండ్లు, డ్రై ఫ్రూట్, పండ్ల రసాలు, పంచామృతాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. 18 కలశాలతో పడునెట్టాంబడి పూజ నిర్వహించి అనంతర స్వామికి చక్రస్నానం చేయించి పూజించారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లికి చెందిన గాయకులు గురు స్వాములు జ్యోతిష్, నంది సాయి, పవర్ పాడిన పాటలు భక్తులను అలరించాయి. స్వామికి పల్లకి సేవ చేస్తూ మాలదారులు పేటతుల్లి ఆటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు చంద్రమోహన్, వినాయక్, మోహన్, శ్యాంసుందర్, శ్రీనివాస్, సంతోష్, బాల రాము, చిట్టిమల్ల సంతోష్, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హక్కులను కాపాడుకోవాలంటే రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సమాత సైనిక్ దళ్ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్ర జాదవ్ అన్నారు. జనవరి 17 నుంచి 26వ తేది వరకు పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక్ బుద్ధ విహార్‌లో నిర్వహించే శ్రమ్నేర్ సైనిక్ ప్రసిక్షణ్ శిబిరంపై అవగాహన కల్పించేల జిల్లా వ్యాప్తంగా బైక్ మార్చ్‌ను చేపట్టారు. శనివారం అంబేద్కర్ చౌక్‌లో తంతే బుద్ధ ఘోష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి మూడు రోజుల బైక్ మార్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం గురించి తెలియక ప్రజలు వారి హక్కులను పొందలేకపోతున్నారన్నారు. వాటి గురించి పూర్తి స్థాయిలో తెలియజేడానికి శ్రమ్నేర్ శిబిరాన్ని సమాత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటకులు రవి చంద్రజాబాడే, ఉప సహా సంఘటకులు శీలనంద్ కాంబ్లే, ఆదిలాబాద్ జిల్లా సంఘటకులు విశ్వభూషన్, హర్షవర్ధన్ వాఘ్మారే, రమాకాంత్, సత్యపాల్ వాఘ్మారే, ధన శ్రీ వాఘ్మారే, అశ్విని కడమ్కర్, తక్షశీల కదం, మయూరి కదం పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఉపాధి హామీ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి అని ఎంపీడీఓ శేఖర్ సూచించారు. మండలంలోని పొట్టపెల్లి -కే గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరానికి సంబందించిన బడ్జెట్, చేపట్టే పనుల రకాల గురించి రైతులు, ఉపాధి హామీ కూలీలకు వివరించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు చిన్నరెడ్డి, పోతుగంటి అశోక్, రైతులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి



నవ తెలంగాణ-సారంగాపూర్

దాతల సహారంతో పాఠశాలలు అభివృద్ధి సాధ్యవుతుందని ప్రధానోపాధ్యాయులు సలోమి కరుణ, గంగాధర్ అన్నారు. శనివారం మండలంలోని ధని మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి మేనకోడలు ఎన్ఆర్ఐ అరుణ్ జ్యోతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.70 వేలు, ఉన్నత పాఠశాల కు రూ.1.50 లక్షల విలువ గల డిజిటల్ టివి, వాటర్ ప్యూరి ఫై, గ్రీన్ బోర్డు, ఫర్నిచర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వడ్డే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో ఉన్న మౌలిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటు ఉపాధ్యాయుల బోధనలను శ్రద్ధగా వినాలన్నారు. ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. దాతలకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ చిన్నయ్య, బీజేపీ నాయకులు రాజేందర్ రెడ్డి, గంగారెడ్డి, మండల కన్వీనర్ విలాస్, శ్రీనివాస్, సాగర్ వెంకట్, పోశెట్టి, నర్సయ్య, రాములు, ఎస్ఎంసీ చైర్మెన్ భోజన్న పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఆపాలని ఎమ్మెల్సీకి వినతి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంట పొలాల్లో నిర్మించనున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుని కలిసి సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. తన వంతుగా ఫ్యాక్టరీ పనుల నిలివివేతకు సహకారం ఉటుందని భరోసా ఇచ్చినట్లు పోరాట సమితి నాయకులు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో పసుల పవన్, కోడె నవీన్, సప్పుల నర్సయ్య, గోపు రాకేష్, ఈరవర్తి ప్రదీప్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పౌష్టికాహారంతో పాటు చిరు ధాన్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేల ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించామని సీబీఆర్ ప్రిన్సిపల్ జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సీబీఆర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాటశాల కరస్పాండేంట్ అల్లూరి శోభ, ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి హాజరై ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శన, అమ్మకాలు చేపట్టారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు వంటకాలను కొనుగోళు చేసి రుచి చూశారు. దీంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకొని, పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. దర్శనానికి వచ్చిన పలువురు పట్టణ ప్రముఖులతో మాట్లాడారు. ఈ కార్యక్రమ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

28న ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ టీఎస్ ఆర్టీసీలో ఐటీఐ అప్రెంటిస్ కోసం నమోదు చేసుకున్న అభ్యర్థులు 28న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని ఆర్ఎం సోలెమాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ అధికార వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు అభ్యర్థులు 28న ఉదయం 10 గంటలకు ఆర్ఎం కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

బేరసారాలు షురూ..!

- చైర్మెన్ పదవి కోసం డబ్బుల ఎర
- పార్టీ మారేందుకు కౌన్సిలర్ల యత్నం



ఖానాపూర్ మున్సిపాలిటీ

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవిశ్వాస తీర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ సెగ ఖానాపూర్ మున్సిపాలిటికి తాకింది. చైర్మెన్, సభ్యుల విబేదాలు రావడంతో వారు అవిశ్వాస తీర్మాణం వరకు వచ్చింది. అయితే ప్రస్తుత చైర్మెన్ తన పదవీని కాపాడుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. ఈక్రమంలో పలువురు కౌన్సిలర్లతో బేరసరాలు చేస్తున్నట్లు తెలిసింది. ఖానాపూర్ మున్సిపాలిటీగా మారితరువాత 2019లో జరిగిన తొలి ఎన్నికల్లో 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఇందులో బీఆర్ఎస్ 5, కాంగ్రెస్ 5, బీజేపీ1, ఇండిపెండెంట్ నుంచి ఒకరు గెలిచారు. చైర్మెన్ ఎన్నికకు సరిపడా బీఆర్ఎస్‌కు మెజార్టీ లేకపోవడంతో అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖా నాయక్ చాలెంజ్‌గా తీసుకున్నారు. చైర్మెన్ పదవిని చేజార్చుకుంటే తన ప్రతిష్టకే భంగంగా భావించిన ఆమె ఇండిపెండెంట్, కాంగ్రెస్ నుంచి ఇద్దరు కౌన్సిలర్‌లను పార్టీలోకి చేర్చుకున్నారు. స్పష్టమైన మెజార్టీ సభ్యుల మద్దతుతో చైర్మెన్‌గా అంకం రాజేందర్, వైస్ చైర్మెన్‌గా ఖలీల్‌లను ఎన్నుకున్నారు. కొంత కాలం వరకు వీరి పాలన సాఫీగా సాగింది. కొలువు దీరిన కొత్తలో చైర్మెన్ పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కలిసి గోవా పర్యటనకు వెళ్లారు. ఓ కాంట్రాక్టర్ వీరికి స్పన్సర్‌గా ఉన్నారు. ఇదే వీరి మధ్యన విభేదాలకు బీజం వేసిందంటున్నారు. పర్యటనను సభ్యులు అప్పట్లో చైర్మెన్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కాల క్రమేనా చైర్మెన్, కౌన్సిలర్ల మధ్యన సఖ్యత లేకుండా పోయింది. రెండేండ్ల నుంచి చైర్మెన్, సభ్యుల మధ్యన సాగుతున్న అతర్ యుద్ధం తారాస్థాయికి చేరింది. చైర్మెన్ ఎవరికి చెప్పకుండా ఏకపక్ష నిర్ణాయాలు తీసుకుంటున్నారని కౌన్సిలర్లు పలుమార్లు బహిరంగానే ధర్నాలు, నిరసలు తెలిపారు. ఖర్చులు, అభివృద్ధి విషయంలో తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని ఉన్నతాధికారులకు అప్పట్లో కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. అలా మొదలైన విభేదాలు చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మాణం నోటీసు వరకు దారి తీసింది.

బేరసారాలు షురూ...

ఆరు నెలల క్రితం 9 మంది సభ్యులతో చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాణం నోటీసు ఇచ్చారు. బల నిరూపన కోసం అధికారులు జనవరి 5వ తేదిని నిర్ణయించారు. ఈ క్రమంలో చైర్మెన్ రేసులో ఉన్న సభ్యుడు తనకు అవసరమైన మెజార్టీ కోసం పలువురు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈపరిణామంతో మొన్నటి వరకు తమ పదవులకు ఎలాంటి ఢోకా లేదని భావించిన చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్ పునరాలోచనలో పడినట్లు సమాచారం. సమర్ధవంతమైన పాలన చేయక పదవిని పోగుట్టుకున్నామన్న అపవాదు నుంచి బయట పడడం ఇప్పుడు వారికి సవాల్ గా మారింది. అవిశ్వాసం వీగిపోతే తప్ప వారికి పదవీ గండం నుంచి బయటపడే అవకాశాలు లేవు. ఈక్రమంలో చైర్మెన్, వైస్ చైర్మెన్ పలువురు కౌన్సిలర్లతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి వ్యూహం ఎలా ఉన్నా ఈ పరిణమం మాత్రం కౌన్సిలర్లకు ఆర్థిక వనరుగా మారిందని చెప్పొవచ్చు. చివరి సమయం వరకు కౌన్సిలర్లు ఎటు వైపు ఉంటారో చూడాలి.

చదువుతోనే ఉన్నత శిఖరాలు : జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి దా.వీఆర్ఆర్ వరప్రసాద్

నవతెలంగాణ-తలమడుగు

చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని, గిరిజనులు ఆ దిశగా వారి పిల్లలను చదివించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపూర్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉద్యోగి కాడే స్వామి దుప్పట్ల పంపిణీ చేపట్టారు. దీనికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ పాల్గొని దుప్పట్లను గిరిజనులకు అందించారు. ముందుగా జడ్జీకి గిరిజనులు గుస్సాడీ నృత్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జీ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు, ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలు, రిజర్వేషన్లను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గిరిజన గ్రామాల్లో పోడు పట్టా భూములకు డీఎల్ఎస్ఏను సంప్రదిస్తే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి న్యాయం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఎస్సీ,ఎస్టీ వారి కోసం ప్రత్యేక చట్టాలున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదనపు న్యాయమూర్తి డా. పి.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ మద్యం మత్తులోనే నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. దాత కాడే స్వామి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఉన్న పేదలు, వృద్ధులు, విద్యార్థులకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, సర్పంచ్ తొడసం రాధ మనోహర్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, తహసీల్దార్ రాజమోహన్, మండల విద్యాధికారి నారాయణ, పీపీ మేకల మధుకర్, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్, ఎస్సై ధనశ్రీ, నేతుల గంగన్న, బోండ్ల వెంకటస్వామి, భరత్, తుకారం, డాక్టర్ శరత్, శంకర్, బ్యాంక్ సిబ్బంది శ్రీనివాస్ , పెందూర్ కామేశ్వరరావు, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, బండు, శంకర్, ఆనందరావు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శంకర్



కిసాన్ చౌక్‌లో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రైతు సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కిసాన్ చౌక్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, రైతు సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని అన్నదాత విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమం కోసం ప్రభుత్వాలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్న బాదలు మాత్రం తీరడం లేదన్నారు. వాటిని పూర్తిస్థాయిలో తీర్చేల ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా ప్రజలను రైతుల పట్ల చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మాజీమంత్రి జోగు రామన్న మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ముందుండి కృషి చేశామని, నాటినుండి నేటి వరకు రైతులతో వారికి సమస్యలు పరిష్కారానికి ముందుండే నడిచామని అదే తరహాలో మున్ముందు ఇలాగే కొనసాగాలన్నారు. సమస్త జీవన ఆధారానికి రైతే వెన్నుముక్కని వారి సమస్యల పట్ల ప్రతి ఒక్కరు సమోచితంగా పోరాటం చేస్తూ రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి రైతుల సమస్యల పట్ల ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, గోవర్ధన్ యాదవ్, కొండ నారాయణ, లోకారి పోశెట్టి, కాళ్ళ విఠల్, దర్శనాల మల్లేష్, లంకరాఘవులు, సుజాత, సంజీవరెడ్డి, దారట్ల కిష్టు, గణపతి, రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పనిలో బీజీబీజీగా ఉంటున్న బ్యాంక్ ఉద్యోగులకు క్రీడ పోటీలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. శనివారం డీసీసీబీ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అథితిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ వారితో క్రికెట్ ఆడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు నిత్యం పనుల్లో బీజీగా ఉంటారన్నారు. వారికి మానసిక ఉల్లాసం కోసం క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఉద్యోగులు రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలన్నారు. అక్కడ జిల్లాకు పేరు తీసుకువచ్చేలా ప్రదర్శనాలు చేయాలని సూచించారు. పోటీల్లో గెలుపోటములను స్వీకరించాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ప్రతి ఒక్కరు వారి క్రీడ స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మెన్ దామోదర్ రెడ్డి, డైరెక్టరులు గోవర్ధన్ యాదవ్, పరమేశ్వర్, ఉద్యోగుల సంఘం నాయకులు ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్ ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహీంద్రా కంపెనీ సహకారంతో రైతులకు యంత్రాల వినియోగం, లాభసాటి వ్యవసాయనికి చేపట్టవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఇది ఇలా ఉంటే వ్యవసాయా శాఖ ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలు మండలంలో ఎక్కడ కూడా నిర్వహించకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మహీంద్రా కంపెనీ మేనేజర్ సమీర్, తిరుపతి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తలమడుగు : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని నందిగామ గ్రామంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ దామోదర్ రెడ్డి రైతులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ రైతు దినోత్సవాన్ని అధికారికంగా జరపాలన్నారు. జై జవాన్..జై కిసాన్ అనడమే కాకుండా వారి కోసం ప్రత్యేక రోజును ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెలంగ్‌రావ్, నాయకులు అనిల్ కుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలో అష్ట భూజ వేణుగోపాల స్వామి రథోత్సవ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ అద్వాల పద్మ రమేష్, సర్పంచ్ ముత్యం రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో ప్రత్యేక వేడుకలు జరిగాయి. వడ్యాల గ్రామంలోని రామాలయంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



నవతెలంగాణ-తలమడుగు

విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలను చేస్తూ భావి శాస్త్రవేత్తలుగాఎదగాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రావ్ కోరారు. శనివారం పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు. ఆరుగురు విద్యార్థుల ప్రదర్శనాలను జిల్లా స్థాయి ఎంపికకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని ధన్నూర్-బి గ్రామంలోని శనివారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకోని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఉత్తమ రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు జీవితం మనం తినే ఆహారంపైన ఉంటుందన్నారు. అలాగే రైతు శ్రమించి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంటలు పండించి ఆకలి తీరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సింగం భోజారెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, సంగెపు లస్మయ్య, దామెర్ల ప్రణీత్ రెడ్డి, గజ్జల లస్మన్న, మార శ్యామ్ సుందర్ రెడ్డి, సహేందర్ రెడ్డి, గోపి, టీ గంగారెడ్డి, రమేష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మార్వాడి ధర్మశాలోని వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని రామన్న అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు శాలువాతో సత్కరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను సేకరించారు.

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని నార్నూర్ సర్పంచ్ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ కోరారు. శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆదిలాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయస్సులోనే ప్రజా సేవ చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
3
ఆదివారం | డిసెంబర్ 24, 2023 | www.navatelangana.com

మహిళా సాధికారత హబ్ ద్వారా మహిళల అభివృద్ధి

నవతెలంగాణ-నస్పూర్

బాలికల, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి మహిళా సాధికారత హబ్ కృషి చేస్తోందని ఆ హబ్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లిలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, తాళ్ల గురిజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో హబ్ జెండర్ స్పెషలిస్టులు విజయ, మౌనికలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. భేటీ బచావో-భేటి పడావో, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాలిక విద్య, బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్-బాడ్ టచ్, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567 తదితర అంశాలపై వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఐఎన్టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, సెంట్రల్ కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ కార్మికులకు పిలుపు నిచ్చారు. శనివారం కాసిపేట 2వ గనిపై పలు కార్మిక సంఘాల నుంచి 30 మంది ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. దీంతో పాటు కాసిపేట, మండల కేంద్రంలో పలు యూనియన్ల నుంచి నాయకులు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులన్నింటినీ సాధిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, సెంట్రల్ కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్, ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, మేడ సమ్మయ్య, నరేందర్, తిరుపతి, పరమేశ్, కోడూరి మునేందర్, బాపు, తొంగల కుమార్, చింతల రవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 12న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్

నవతెలంగాణ-కాసిపేట

దేశంలో అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఇతర 16 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12న చేపట్టే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్ తెలిపారు. శనివారం జూనియర్ బాయ్స్ కళాశాల సమీపలంలో చలో పార్లమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ విద్యా సంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర విశ్వ విద్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, జరిమానాలు విధిస్తున్నారని, ప్రశ్నించే గొంతుకలను నిర్బంధించే చర్యలు ప్రజాస్వామ్యంలో ఉండరాదన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిరసన తెలిపితే రూ.20 వేల జరిమానా విధిస్తామని వైస్ ఛాన్సలర్ సర్క్యులర్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఎన్టీఏ ద్వారా అన్ని రకాల జాతీయ స్థాయి పోటీ పరీక్షలను కేంద్రమే నిర్వహించాలని చూస్తుందన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలన్నీ ఎన్టీఏ నిర్వహించడం ద్వారా అధికార కేంద్రీకృతమై తమిళనాడులో జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్టులో అవకతవకలు జరిగిన మాదిరిగా ఇతర పోటీ పరీక్షల్లో జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్టీఏ అనే ఒకే గొడుగు కింద జాతీయస్థాయి పోటీ పరీక్షలు అన్నీ నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బీసీ విద్యార్థులకు ఇచ్చే జాతీయస్థాయి ఫెలోషిప్‌లు కోత విధిస్తున్నారని, ఈ కారణం చేతనే జాతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అందరికీ ఉచిత విద్య, అందరికీ ఉపాధి కల్పించాలని చేపట్టబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అందరూ మద్దతు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బెల్లంపల్లి మండల కమిటీ సభ్యులు రము, విజయకుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



చలో పార్లమెంట్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మందమర్రి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ హైస్కూల్ మైదానంలో 104వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింగరేణి స్టాల్స్, వివిధ రకాల తిను బండారాల స్టాల్స్, సేవా స్టాల్స్‌ని ప్రారంభించారు. అనంతరం సింగరేణిలో వినియోగిస్తున్న నూతన టెక్నాలజీ యంత్రాల పనితీరు స్టాల్స్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగులు కార్మికులు సంస్థ పై అంకితభావం తెలిపే విధంగా అట్టహాసంగా ఆహ్లాద భరితమైన వాతావరణంలో సంస్థ ఇంత గొప్పగా వేడుకల్ని నిర్వహిస్తున్నదని, వంద సంవత్సరాల క్రితం బొగ్గు బావుల్లోకి కష్టంగా వెళ్లే పరిస్థితులు ఉండేవని కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యాధునిక యంత్రాలనుపయోగించి బొగ్గు వెలికి తీసే స్థితికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. అత్యధిక ఉద్యోగ అవకాశాలు ఇస్తున్న సంస్థ కూడా సింగరేణి సంస్థనే అని, స్వరాష్ట్రం ఏర్పడటంలో కూడా సింగరేణి పాత్ర ప్రముఖమైనదని తెలిపారు. ఉత్పత్తి విషయం లో ఈ ఆర్థిక సంవత్సరం ఏరియాకి నిర్దేశించిన లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 87శాతం ఉత్పత్తి సాధించామని, దీనిని ఉద్యోగులు అందరూ కలిసి సమిష్టి కృషితో వంద శాతం సాధించాలని కోరారు. కార్యక్రమంలో సవిత మనోహర్ సేవా సమితి అధ్యక్షురాలు, ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, హెచ్ఒడిలు, ఏజెంట్లు, మేనేజర్లు, ఏజీఎం(ఈ అండ్‌యం), ఏజీఎం(ఫైనాన్స్), డివైజీఎంలు, డివై పీఎంలు, పిఓలు, జీఎం కార్యాలయ అధికారులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నస్పూర్ : సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు ఉద్యోగుల సంక్షేమనికి పెద్దపీట వేస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 134 సంవత్సరాల చరిత్రలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 70మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నెల వరకు సంస్థ 50మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా శ్రీరాంపూర్ ఏరియా 81 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని కోరారు. విద్యుత్ రంగంలో జైపూర్ పవర్ ప్లాంట్ నుండి 1200మెగా వాట్స్ ఉత్పత్తి చేస్తూ దేశంలోనే మొదటి, రెండవ ర్యాంక్ లో నిలిచామన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా 227 మెగా వాట్స్ ఉత్పత్తి సాధిస్తూ రెండవ స్టేజ్ లో 230 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. 2024 డిసెంబర్ వరకు ఇది పూర్తయితే సోలార్ ద్వారా 554 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. కొత్త గనుల ఏర్పాటుతో సింగరేణి సంస్థ జీవిత కాలం మరో 130సంవత్సరాలు పెరుగుతుందన్నారు. సింగరేణిలో ఇప్పటి వరకు 15వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఉద్యోగులకు సంస్థ సాధించిన లాభాల్లో వాటా చెల్లిస్తున్న ఏకైక సంస్థ సింగరేణి అని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ అధికారులు, ఉద్యోగులను సన్మానించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలి

జైపూర్ : మండల పరిధి షెట్‌పల్లి గ్రామ పంచాయతీ శివారులో గోదావరి నది వద్ద పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలని పరిసర గ్రామాలకు చెందిన నాయకులు కోరతున్నారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసిన నాయకులు షెట్‌పల్లితో పాటు నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, ఎల్కంటి, గంగిపల్లి, పెగడపల్లి తదితర గ్రామాల వారి సౌకర్యార్థం షెట్‌పల్లి శివారు గోదావరి నది వద్ద పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి స్నానాల కోసం నది వద్దకు వెళ్లిన వారు ఒడ్డు మీదుగా గోదావరి నదిలోకి దిగడం ఇబ్బందిగా మారిందని వివరించారు. ప్రధానంగా మహిళలు, చిన్న పిల్లలు గోదావరి స్నానం కోసం వచ్చినప్పుడు నానా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని తెలిపారు.

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా

- గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించండి
- మిషన్ భగీరథ నీటి సరఫరా 15 రోజుల్లో కొనసాగాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేస్తున్నానని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. చెన్నూర్ మండలం లక్ష్మీపూర్‌లో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ఆయన గ్రామస్తుల సౌకర్యార్థం బస్సులు, రోడ్లు, మంచి నీటి వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై మొట్టమొదటగా పాఠశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. చెన్నూర్ మండలం సోమన్‌పల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంధర్శించిన ఆయన కోతలు విధించకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు నుంచి గోదావరి తీర ప్రాంత భూములను కాపాడలని రైతులు కోరారు. గోదావరి తీర ప్రాంతంలో కరకట్ట విషయమై సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా 15 రోజుల్లో కొనసాగించాలని ఈ సంధర్బంగా అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ పండుగ సంధర్బంగా చెన్నూర్‌లో క్రిష్టియన్ కుటుంబాల వారికి ప్రభుత్వ పరంగా కొత్తబట్టలు పంపిణీ చేశారు. క్రైస్తవ, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

జైపూర్‌లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేదిక మీదుగా ప్రభుత్వ పరంగా మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌ను సంధర్శించిన ఆయన విలేకరులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంటి స్థలాలలతో పాటు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా ఆర్థిక తోడ్పాటు అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు మాస్కుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు, సఖి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బండ శాంకరి ఆధ్వర్యంలో కరోనా వ్యాపిస్తున్న కారణంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సఖి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కోవిడ్ కేసులు నమోదవుతున్న సందర్భంగా ఎయిమ్స్ జారీ చేసిన నిబంధనల ప్రకారం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ మాస్కులు ధరించాలని తెలియజేశారు. విద్యార్థులు తరగతి గదులలో, భోజన సమయంలో ప్లే గ్రౌండ్‌లో దూరాన్ని, పరిశుభ్రతని పాటించాలని తెలిపారు. ఎవరికైనా విద్యార్థులు పొడి దగ్గు, తుమ్ములు, ఒళ్ళు నొప్పులు, తీవ్ర జ్వరం, అలసట నీరసము వంటి లక్షణాలు కనబడితే వెంటనే తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ గోపాల్, మాధవి లత, అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు.

డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలి



నవతెలంగాణ-తాండూర్

డయల్ 100 కాల్సుకు వెంటనే స్పందించిచాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. శనివారం వార్షిక తనిఖీలో భాగంగా బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం రికార్డులు కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ధర్యాప్తులలో నైపుణ్యత కనబరచాలని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ కేసులను త్వరితగతంగా పూర్తి చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవించి వారి సమస్యలను సహనంతో పరిష్కారం చూపే విధంగాకృషి చేయాలన్నారు. పట్టణంలో దొంగతనల నివారణకు రాత్రి పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టపరచాలని ఆదేశించారు. ఎల్లవేళలా పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ కొనసాగించాలని, లోక్ అదాలత్‌లో భాగంగా రాజీ పడుటకు అవకాశం ఉన్న కేసుల పరిష్కారరకు కృషి చేయాలన్నారు. రాబోవు ఎన్నికలు కూడా సజావుగా జరిగేందుకు ఇప్పటినుండే ప్రతిఒక్కరు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ బన్సీలాల్ పట్టణ ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలల్లో హెడ్ గర్ల్, హెడ్ బాయ్ ఎన్నికల కోసం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య సమక్షంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొని తమ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ను ఓట్లు వేసి ఎన్నుకున్నారు. ఇంటర్ హెడ్ బాయ్‌గా ఎంపీసీ సెకెండియర్ విద్యార్థి సిద్దార్థ, హెడ్ గర్ల్‌గా ఎంపీసీ సెకెండియర్ విద్యార్థి ప్రవళికను ఎన్నుకున్నారు. స్కూల్‌లో హెడ్ బాయ్‌గా 10వ తరగతి విద్యార్థి తరుణ్ తేజ, హెడ్ గర్ల్‌గా పదో తరగతి విద్యార్థి కార్తికాను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కూకట్ల రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో స్నేహభావం పెరుగుతుంది

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్


జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారభింస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఎంచుకున్న లక్ష్యాన్ని ఏకాగ్రత, పట్టుదలతో సాధించడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహద పడుతాయని, అంతే కాకుండా స్నేహభావం పెరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన 3వ వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక క్రీడా పోటీలలో పాల్గొనడం సంతోషంగా ఉందని, తన పాఠశాల రోజులు, ఐఏఎస్ శిక్షణ పొందిన రోజులు గుర్తుకు వచ్చాయని అన్నారు. క్రీడ పోటీలలో గెలుపు, ఓటములు సహజమని, మన మధ్య స్నేహభావం పెంపొందడానికి క్రీడా పోటీలు ఒక వేదిక అని అన్నారు. విద్యార్థులు పోటీలలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, తల్లితండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు విద్యలు రాణిస్తూ మార్కులు సంపాదించడం మాత్రమే లక్ష్యంగా ఎంచుకుంటున్నారని, క్రీడల ద్వారా మనం అనేక అంశాలను నేర్చుకుంటామని, సమన్వయం, మద్దతు, నాయకత్వం, అందరితో స్నేహాన్ని పెంచుకోవడం నేర్చుకోవడంతో పాటు ఓటమి ఎదురైనప్పుడు ఎదుర్కొనే సామర్థ్యం, ఓటమికి కారణాలు తెలుసుకొని తిరిగి విజయాన్ని సాధించే మెలకువలు సంపాదించుకుంటామని తెలిపారు. క్రీడలతో శారీర దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడంలో అవసరమైన ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణ అలవాటు అవుతాయని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థులకు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

క్రిస్మస్ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీసస్ క్రీస్తు ప్రజలంతా సంతోషంగా ఉండాలని బోధించారని, వీటిని పాటిస్తూ ఆనందంగా జీవించాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందించడం జరిగిందని, క్రిస్మస్ రోజున ప్రతి కుటుంబం పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కానుకల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి 1000 క్రిస్మస్ కానుకలు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు 3 వేల కానుకలు పంపిణీ చేయడం జరిగిందని, విందుకు నియోజకవర్గానికి రూ.2 లక్షల చొప్పున 3 నియోజకవర్గాలకు రూ.6 లక్షలు అందించడం జరిగిందని, క్రైస్తవ సోదరులు పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల తహసీల్దార్, సంబంధిత శాఖ అధికారులు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంసీ వైస్ చైర్మెన్ సంజీవరెడ్డి రాజీనామా

నవతెలంగాణ-బోథ్



మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఏలేటి సంజీవరెడ్డి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. శనివారం తన రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీ దేవయ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న బోథ్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన పాలకమండలి సమావేశం జరిందని, సీసీఐ పత్తి కొనుగోలు విషయంలో జిల్లా ఉన్నతాధికారి ఏడీ శ్రీనివాస్‌ను తను రైతుల పక్షాన మాట్లాడమన్నారు. కానీ జిల్లా ఉన్నతాధికారులు స్థానిక వ్యాపారస్తులకు తరఫున మాట్లాడారని, అధికారుల తీరుకు నిరసనగా తన మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయడం జరిగిందన్నారు.

ఆదివాసీ తెగను ఆదుకోవాలి

నవతెలంగాణ-కెరమెరి



ఆదివాసి కోలం తెగలను ఆదుకోవాలని స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అనక దేవేందర్ అన్నారు. మండలంలోని వెనుక బడిన ఆదివాసీ కోలాంతెగ గ్రామాలైన మురికిలొంక, చిన్నుగూడ, దుబ్బగూడ కెస్లాగూడ గ్రామాల్లోని 100 కుటుంబాలకు కనక దేవేందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కోలాం గ్రామాల్లో నేటికీ అనేక కుటుంబాల ఆర్థిక పరిస్థితి, జీవన విధానంలో మార్పు రాలేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటిన కనీసం ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి గుడ్డ, తినడానికి తిండి లేక దీనస్థితిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదివాసీ కోలాం తెగలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడం రాజు, సభ్యులు ఆత్రం తుకారాం సభ్యులు కుర్సెంగా మారుతీ, గొండ్వాన ఫౌండేషన్ సభ్యులు చందు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలి



నవతెలంగాణ-తాంసి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ఓటర్ జాబితా సవరణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాలో మార్పులుచేర్పులు, సవరణలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటర్ జాబితా అప్‌డేషన్ గురించి అవగాహన కల్పించారు. ఒక వ్యక్తికి ఒక నియోజకవర్గంలో మాత్రమే ఓటు హక్కు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి వివరాలు తీసుకొని ఆ వ్యక్తి అనుమతి ప్రకారంగా ఒకచోటనే ఓటు హక్కు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరేష్, రాఘవేంద్ర, బీఎల్ఓలు విజయలక్ష్మి, భగీర్థ, సిబ్బంది ప్రశాంత్, స్వాగత్ ఉన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రభుత్వం నుంచి మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రైస్తవులకు ప్రభుత్వ మంజూరు చేసిన క్రిస్మస్ కానుకలను ఎమ్మెల్యే కోవలక్ష్మి అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీలకు గత తమ ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. రానున్న రోజుల్లో వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారిని రమాదేవి, ఎంపీపీ మల్లికార్జున్, జీసీడీఓ శకుంతల, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరి మంగ, పెంటయ్య, సర్పంచ్ భీమేష్, కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో ఫ్రీ లోక్ అదాలత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ ఆధ్వర్యంలో ఫ్రీ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాంకిడి ఎస్సై సాగర్ స్టేషన్ పరిధిలోని 40కి పైగా అపరధ రుసుము కేసులను కోర్టులో జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. వారందరికీ అపరాధ రుసుం విధిస్తూ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాజి కేసులు వచ్చేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రి-లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదా కేసులు, వివాహ, కుటుంబ తగాదాల కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను పరిష్కరించబడుతాయని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై వ్యాసరచన పోటీ

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం చట్టాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరాం ప్రసాద్ బహుమతులు అందించారు. మొదటి బహుమతి పదవ తరగతి విద్యార్థి నేతుల రామ్ చరణ్, రెండవ, మూడవ బహుమతులు ప్రణయ్, అఖిల్ పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ నేతల గంగన్న, ఉపాధ్యాయుల వినోద్ రెడ్డి, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర సిబ్బంది కాడే స్వామి, శ్రీనివాస్, స్వామి, రాకేష్ పాల్గొన్నారు.

కొలాం హైస్కూల్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ పట్టణంలోని కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం అంకొలి పీహెచ్‌సీ వైద్యుడు డా.సర్ఫరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులను పరీక్షించి మందులను అందించారు. 384 మంది విద్యారులందరిని పరీక్షించగా 134 మందికి సీజనల్ వ్యాధులున్నట్టు గుర్తించామని వైద్యులు తెలిపారు. అనంతరం వంటశాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ బొమ్మెత సుభాష్, ఆడే సురేష్,హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్, ఆశాలు నర్మధ, అనిత, హెచ్‌ఎం నారాయణ రావు, జంగు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- మూడిండ్లు దగ్ధం
- రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



బాధితులకు సరుకులు అందిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



పూర్తిగా కాలిపోయిన ఇల్లు

నవతెలంగాణ-కెరమెరి

షార్ట్ సర్క్యూట్‌తో మూడిండ్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఖైరి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు మోహర్లే చంద్రయ్య, మోహర్లే గిర్మాజీ అన్నదమ్ములు. వాడై కమలబాయి వ్యవసాయ ఆధారిత కుటుంబాలు. శనివారం ఉదయమే గ్రామ సమీపంలోని పొలం పనులకు వెళ్లారు. పిల్లలు కూడా పాఠశాలలకు బయలుదేరడంతో ఇండ్లలో ఎవరూ లేరు. గ్రామంలో సైతం అందరూ రైతులే కావడంతో గ్రామస్తులంతా వారివారి పొలాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఓ ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు రావడాన్ని చిన్నారులు గమనించారు. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో సమీప పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చేలోగా అప్పటికే మూడిళ్లు పూర్తిగా అగ్ని ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఇండ్లలో ఉన్న సామాగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. చంద్రయ్యకు చెందిన 20క్వింటాళ్ల పత్తి, సామాగ్రితో కలిపి రూ.4.50లక్షలు, గిర్మాజికి చెందిన 15క్వింటాళ్ల పత్తి, టివి, నిత్యావసర, ఇతర సామాగ్రి మొత్తం ఆస్తి రూ.4లక్షలు, వాడై కమలబాయికి చెందిన సుమారు రూ.2.50లక్షల ఆస్తినష్టం జరిగింది. ఘటన స్థలానికి తహసీల్దార్ సమీర్ ఖాన్, ఎంపీడీవో మహేందర్ చేరుకొని పంచనామా నిర్వహించారు. వీధిన పడ్డ తమ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, యజమాని వృద్ధుడైన మోహర్లే సోమయ్య కోరారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

అన్నదమ్ములైన చంద్రయ్య, గిర్మాజీ వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఉన్న భూమిని సాగు చేస్తూ రోజువారి పొలం పనుల్లో నిమగ్నం అయ్యేవారు. శనివారం సైతం ఉదయమే పనులకు వెళ్లడంతో షార్ట్ సర్క్యూట్ రూపంలో ఇల్లు దగ్ధమైన విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కండ్ల ముందే ఇండ్లతో పాటు ఇంటి లోపల ఉన్న సామాగ్రి మొత్తం బూడిద కావడంతో బోరున విలపించారు. బాధిత కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరును చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ఇండ్లు పూర్తిగా దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు రూ.10వేల విలువ గల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అధికారులు బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఖైరి సర్పంచ్ లెన్గురే విజయలక్ష్మి బాలాజీ, ఝరి సర్పంచ్ కుంరం నాజేశ్వర్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు సోము, సిడాం ధర్ము కేళి-బి సర్పంచ్ నారాయణ్, గ్రామస్తులు చందు బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో ఉన్నారు.



కాలిపోయిన పత్తి



అగ్ని ప్రమాదంలో నేలమట్టం అయిన ఇల్లు

బీఆర్ఎస్‌కు డీసీసీబీ చైర్మెన్ రాజీనామా

- త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ తగిలింది. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే తన అనుచరులు, అభిమానులతో కలిసి చర్చించిన తర్వాత ఏ పార్టీలో చేరబోయేది నిర్ణయం తీసుకొని, మరో మూడు రోజుల్లో వెల్లడిస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ నుండి బీఆర్ఎస్‌లో చేరానని, పదేండ్లపాటు పార్టీ కోసం పనిచేశానన్నారు. తొందరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. బీఆర్ఎస్‌లో ఉన్నన్ని రోజులు తనకు సహకరించిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జోగు రామన్న తనకు అన్నలాగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆయన బాటలోనే మరికొందరు కీలక నేతలు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ప్రచారం ఊపందుకుంది.

వైకల్యాన్ని జయించి వికలాంగులు అభివృద్ధి చెందాలి

వతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగులు వైకల్యమును జయించి అభివద్ధి చెందాలని జిల్లా సంక్షేమ అధికారిని సావిత్రి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాత జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేందుకు వచ్చే పది రోజుల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని భరోసా కల్పించారు. ఈ సమావేశాల్లో సమస్యలపై చర్చించుకొని ముందుకు సాగుదామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమల పథకాలు పొందడం కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే ముందు దివ్యాంగులు పలు సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంపై డీడబ్ల్యూఓ కార్యాలయం సిబ్బంది తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, అన్ధులకు మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్నారని, ఆన్‌లైన్‌లో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేస్తే ఎటువంటి ఫలితం ఉండడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏడాదికి ఒకసారి నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తమను గుర్తించడం లేదని, సదరం క్యాంపు సమయంలో వైద్యులు నిర్లక్ష్య ధోరణిని వ్యవహరిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా సదరం క్యాంపులు జరుగుతున్నప్పటికీ కొమురం భీమ్ జిల్లాలో జరగడంలేదని వెల్లడించారు. దివ్యాంగులకు పెన్షన్లు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంకు 60 శాఖల అధికారులు హాజరు కావలసి ఉన్నా మూడు శాఖలకు తప్ప ఇతర ఏ శాఖకు చెందిన అధికారులు పాల్గొనడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు గైహాజరుతో తమ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. దివ్యాంగులు చదువులో రాణిస్తున్నప్పటికీ తమకు ఎటువంటి ఉద్యోగాలు కల్పించడం లేదని, రుణాలు సైతం ఎవరికి ఇప్పించడం లేదని ఆరోపించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మొదటి వారంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, మీసేవ నిర్వాహకుల నిర్లక్ష్యంతో దివ్యాంగులకు పెన్షన్స్ రావడం లేదని, జిల్లా మండల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆ కమిటీలకు జిల్లా అధ్యక్షుడిగా కలెక్టర్ ఉండాలని పలు డిమాండ్లు చేశారు. కుమురంభీం జిల్లాలో 9టఓు మందికి సదరం ధ్రువపత్రాలు కలిగి ఉన్నారని, అందులో 40 శాతం బోగస్ వికలాంగులు ఉన్నారని వారిని గుర్తించి ధ్రువపత్రాలను తొలగించాలని డిమాండ్ చేశారు. 2009 నుంచి సదరం ధ్రువపత్రాలపై సర్వే చేపట్టాలని సూచించారు. పలు ప్రభుత్వ శాఖల్లో వికలాంగులకు మంజూరయ్యే నిధుల్లో అవకతవకలు జరుగుతున్నాయని వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఈఓ ఉదయ బాబు, డీఆర్‌డీఏ కార్యాలయ డీపీఎం అన్నాజీ, పెన్షన్లకు సంబంధించిన డీపీఎం యశోద, పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్ ఎఫ్ఆర్ఓ రవి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్లాం, ఉపాధ్యక్షుడు నారాయణగౌడ్ పాల్గొన్నారు.



దివ్యాంగులకు బహుమతి అందిస్తున్న సంక్షేమ అధికారిణి

విద్యాశాఖాధికారిని విధుల నుండి తప్పించండి: టీయూటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖను అప్రతిష్టలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిని విధుల నుంచి తప్పించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. పారదర్శకంగా చేపట్టాల్సిన సర్దుబాటు ప్రక్రియను ఇష్టారీతిన ఉపాధ్యాయులు బోధించే విషయాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికి రెండు, మూడు పాఠశాల కేటాయించారన్నారు. అన్ని మండలాలకు రెండో విడత పుస్తకాలను సకాలంలో చేర్చలేకపోవడం, విద్యాశాఖ అధికారి అలసత్వం వల్ల ఎంఈఓ పర్యవేక్షణ పాఠశాలలపై కొరవడడం, విద్యాశాఖను గాడిన పెట్టాల్సిన విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా పాఠశాల పర్యవేక్షణ చేపడుతున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ, విద్య రంగ వ్యవస్థ బాగుపడాలంటే విద్యాశాఖ అధికారి ప్రణీతను విధుల నుంచి తప్పించి జిల్లా విద్యాశాఖను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు శనివారం ఆసిఫాబాద్‌లోని కుమురరంభీం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, అదనపు కలెక్టర్ రెవెన్యూ దాసరి వేణు, ఎంపీపీ మల్లికార్జున్‌లు హాజరయ్యారు. మొదట స్వామి వివేకానంద చిత్రపటానికి మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద అందరికీ ఆదర్శ ఆదర్శప్రాయమన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. యూత్ డే సందర్భంగా నిర్వహిస్తున్న జానపద సాంస్కృతిక, ఇతర పోటీలను యువత సద్వినియోగం చేసి ఆయా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించడానికి ఇటువంటి కార్యక్రమాలు మంచి అవకాశం అన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తిని తీసుకొని యువత ముందుకెళ్లాలని సూచించారు. యువతకు అన్ని రకాలుగా ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. డీవైఎస్ఓ ఆర్.రమాదేవి మాట్లాడుతూ గత సంవత్సరం గుస్సాడిలో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండోచైర్మన్, అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనా రెడ్డి పాల్గొనగా ఈ పోటీలకు న్యాయ నిర్ణయితలుగా స్థానిక ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నారాయణ మూర్తి, డాన్స్ మాస్టర్ నరేందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాగర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆసిఫాబాద్ జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు, ఇప్పటివరకు పట్టుబడిన డ్రంకెన్‌డ్రైవ్‌లో కానీ, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు, మైనర్ డ్రైవింగ్ కేసులు ఉన్న వారు 26 నుంచి 30వ తేదీ వరకు లోక్ అదాలత్‌కు హాజరైనట్టయితే కేసులను పూర్తిగా రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులు ఉన్న వారు ఆధార్‌కార్డు జిరాక్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్న వారు ఆధార్‌కార్డుతో పాటు మీసేవాలో లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న రసీదు, మైనర్ డ్రైవింగ్ కేసులు ఉన్న వారు పుట్టిన ధ్రువీకరణ పత్రంతో పాటు ఎస్ఎస్‌సీ మెమో తీసుకెళ్లాలని ఎస్సై పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులు రద్దు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని ఆయా కేసుల్లో ఉన్న వారు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్ఆర్ఐ మిత్ర బృందం ఆధ్వర్యంలో బూట్లు పంపిణీ

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఐ మిత్ర బృందం వారు బీబ్రా సర్పంచ్ బండ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు బూట్లు, సాక్సులు, టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండ కృష్ణమూర్తి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సేవ చేయాలనే సదుద్దేశ్యంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు కుర్సిగబేగం, కంబాల జయేందర్ పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ అనిత తెలిపారు. పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి ప్రచార పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం గిరిజన గురుకులాలు పనిచేస్తున్నాయని అన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జనవరి ఆరో తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయడానికి రూ.100 రుసుం ఉంటుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

నవతెలంగాణ-బెజ్జూరు

మండలకేంద్రంలోని రంగనాయక ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శనివారం రంగనాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు పంచామృతాలతో అభిషేకం చేసి వేదమంత్రోచ్చరణ, నారాయణ ఉపనిశత్ పారాయణంతో పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముక్కోటి ఏకాదశి వైకుంఠదామ దర్శనం నేపథ్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో రంగనాయక ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్, సభ్యులు శ్రీనివాస్, నరేందర్, నాగేష్, శ్రీకాంత్, జగ్గాగౌడ్ పాల్గొన్నారు.